# స్వర్ణలత

- తమిరిశ జానకి

రంగుల కాగితాల తోరణాలు, రంగు రంగుల విద్యుద్దీపాలు, పూల అలంకరణలు.. షామియానా కింద కుర్చీలు వాటిమీద ఆశీనులై ఉన్న పిన్నలు పెద్దలు... కలకలలాడు తోంది ఆ ప్రదేశమంతా... చాలా సందడిగా ఉంది. వేదికమీద మైక్ ముందుకి చిరునవ్వుతో వచ్చింది. ఆ సేవాసదనం నిర్వాహకురాలు... రచయిత్రి అయిన లతాదేవి...

మాట్లాడుతున్న వాళ్ళు కూడా మాటలు ఆపేసి, ఆమె చెప్పేది వినడానికి కుతూహల పడుతూ ఆమెవంకే చూస్తూ కూర్చున్నారు.

లతాదేవి గొంతు సవరించుకుంది. "ఈరోజు మా సేవాసదనం సాంస్కృతిక కార్యక్రమాలకి విచ్చేసిన మీ అందరికీ నా కృతజ్ఞతలు. ఇంతకుముందు కొంచెం సేపటి క్రితం కొంతమంది మహిళలు "అబలలు... ఆత్మహత్యలు..." అనే విషయమ్మీద చాలా చక్కగా మాట్లాడారు. కానీ, అందరూ కూడా మొగవాళ్ళు మారాలి. కట్నాలు తీసుకోకూడదు. భార్యని మానసికంగా కానీ, శారీరకంగాకానీ హింసించకూడదు. ఆమె కూడా ఒక మనిషే అని అర్థం చేసుకోవాలి... అంటూ మాట్లాడారు... నిజమే... ఫస్ట్ పాయింట్ అదే నేనూ ఒప్పుకుంటాను. కానీ, ఒకవేళ కష్టాలపాలు చేసి ఏడిపించుకు తినే భర్త ఉన్న ఆడది ఎన్నేళ్ళయినా అలా కష్టాలు దిగమింగుతూ, చిత్రహింస ననుభవిస్తూ చివరికి ఓపిక నశించి జీవితమ్మీద ఆశకోల్పోతే... ఆమె ఆత్మహత్యకి పాల్పడకుండా చేయగలిగే శక్తి మరో ఆడదానికే ఉంది... ఆమె, కన్నతల్లి... అందుకే మొదట ఆడపిల్లల్ని గన్న తల్లుల దృక్పథంలో మార్పు రావాలి... ఔను... అప్పుడే ఆడపిల్ల ఆత్మహత్య అనేతలంపు రానివ్వక తలెత్తుకుని ధైర్యంగా జీవించగలుగుతుంది... అందుకే నా ఉద్దేశంలో పురుషుడు స్త్రీని తన సాటి మనిషిగా చూడటం ఎంత ముఖ్యమో ఆడ పిల్లల్ని కన్న తల్లుల దృక్పథంలో మార్పురావడం కూడా అంతే ముఖ్యం ఆ దృక్పథం న్యాయబద్ధమై నదిగా ఉండాలి. ఆడపిల్ల అడకత్తెరలో నలిగిపోయే విధంగా ఉండకూడదు. మీరు ఓపికగా వింటానంటే ఓ చిన్నకథ మీకు వినిపించాలని ఉంది... వింటారా?" సభని కలయచూసింది లతాదేవి.

శ్రోతలంతా ఏకాభిప్రాయం వెలిబుచ్చారు... "చెప్పండి, చెప్పండి వింటాం... స్వయంగా మీరు కథ చెప్తుంటే వినగలగడం మా అదృష్టం" సభ నిశ్శబ్దమైంది... అందరి కళ్ళల్లో కుతూహలం తొంగిచూస్తోంది.

!+!+!+!

"మా అబ్బాయికీ పెళ్ళయింది. నాకూ కోడలొచ్చింది. ఏం లాభం? కట్నం ఎంతని అడుగు. ముష్టి మూడువేలు.. చక్కగా నువ్వే అదృష్టవంతురాలివి పదిహేను వేలు కట్నం

తెచ్చింది మీ కోడలు..." దండకం చదువుకుపోతోంది తాయారమ్మ. ఆవిడ మాటలకి గర్వపడిపోతోంది సుభద్రమ్మ, తన కోడలు కట్నం బాగా తెచ్చిందని.

కాఫీ గ్లాసులు తీసుకొచ్చి ఆ ఇద్దరి ఎదురుగానూ పెట్టింది స్వర్ణ.

"ఇదిగో ఈ దరిద్రాన్ని తెచ్చుకున్నాం ఇంటికి. ఓ అచ్చటా లేదు ఓ ముచ్చటా లేదు." కోడలి వీపు మీద గట్టిగా మోచేత్తో పొడిచింది తాయారమ్మ.

తల వంచుకుని మాట్లాడకుండా లోపలికి నడిచింది స్వర్ణ.

"పేరులోనే స్వర్ణ తప్ప, మనిషి ఒంటి మీద అట్టే లేదు స్వర్ణం. పెళ్ళిలో ఆడబడుచులకి పట్టుచీరలు పెడతార్కనుకున్నాం. హూ... నూరు రూపాయల ఖరీదు చేసే చీరలే పడేశారు ఒక్కొక్కళ్ళకీ... అవమానంతో తలెత్తుకోలేక పోయామనుకో... అంతా మా కర్మ"

ఇంటికి ఎవరొచ్చినా తప్పకుండా ఈ దండకమే చదువుతూ ఉంటుంది తాయారమ్మ. వింటుంటే గుండెల్లో శూలాలు పెట్టి పొడుస్తున్నట్టే ఉంటుంది స్వర్ణకి. కళ్ళనీళ్ళు పెట్టుకోని రోజు ఉండదు.

!+!+!+!

"స్వర్ణా..." పిలిచాడు ఆనందరావు ఇంట్లోకి వొస్తూనే.

"ఆ వొస్తున్నానండీ..." వెంటనే జవాబిచ్చి, వంటిట్లో చేస్తున్న పని వొదిలిపెట్టి మరుక్షణం, ముందు గదిలోకి వొచ్చింది.

"పిలిచిన గంటకా రావడం?" అనవసరమైన కోపం, చేతిలోని తెలుగు పేపర్ మీద చూపిస్తూ, విసురుగా నేలకేసి కొట్టాడు.

"ఇప్పుడే కదండీ ఇంట్లోకి వొస్తూనే ఒక్కసారే పిలిచారు. వెంటనే వొచ్చాను." కింద పడేసిన పేపర్ తీసి జాగ్రత్తగా బల్లమీద పెడుతూ యాదాలాపంగా అంది.

"నోర్ముయ్! నాకు ఎదురు సమాధానం చెప్తావా? ఎంత పొగరు..." స్వర్ణ చెంప చెళ్ళుమంది. చెంప తడుముకుంటూ తలవంచుకున్న స్వర్ణ కళ్ళల్లోంచి టపటపా కన్నీటిబొట్లు రాలిపడ్డాయి.

"ఏమిట్రా?" రంగంలోకి అత్తగారు దిగడంతో తలెత్తి బిక్కుబిక్కుమంటూ చూసింది స్వర్ణ.

"ఏవుందీ... మాట్లాడితే చాలు నెత్తి మీది నీళ్ళకుండ దింపుతూ ఉంటుంది ఈవిడ గారు" హేళన, అసహ్యభావం వొలికిస్తూ భర్త చూసే చూపులు తట్టుకుందుకు గట్టి ప్రయత్నం చేయవలసొచ్చింది స్వర్ణకి.

"ఒంటి మీద బంగారం తొడుగు కాకుండా నెత్తిమీద నీళ్ళకుండ పెట్టి దీన్ని కాపురానికి పంపారు వీళ్ళవాళ్ళు. తెలియక గోతిలో పడ్డాం. ఆ రామయ్య గారబ్బాయి నీతోటి వాడే

కాదూ? ఇరవై వేలుచ్చుకున్నాట్ట కట్నం అత్తగారికీ, ఆడబడుచులకీ లాంఛనాలు ఘనంగా ముట్టచెప్పారుట. నేను తప్ప ఈ లోకంలో అందరు మొగపిల్లల తల్లులూ అదృష్టవంతులుగానే కనబడుతున్నారు.... పోనీ, ఇంకో కొడుకు పెళ్ళిలో రాబట్టుకుందామా అంటే నాకున్నది నువ్వొక్కడే కొడుకువయ్యె...."

భర్తకి కాఫీ కలిపి తీసుకొద్దామని వంటిట్లోకి నడవబోయింది... అత్తగారూ భర్తా తనని, తన పుట్టింటి వారిని ప్రతి రోజూ తిట్టేతిట్లూ అనే మాటలూ వినీ వినీ చస్తూ బతుకుతున్న స్వర్ణ

"ఏయ్! ముంగీ... ఏవిటా పొగరు అలా వెళ్ళిపోతున్నావు?"

"మీకు కాఫీ కలిపి తెద్దామని."

"ఏడిశావులే... పెద్ద పతివ్రతలా ఫోజూ నువ్వూనూ. చెప్పేది విని తగలడు. రేప్పొద్దున్న ఫస్టు బస్సుకి మీ ఊరెళ్ళి మూడు వేలు తీసుకురా. అర్జంటుగా కావాలి" ఖచ్చితంగా చెప్పేశాడు. అక్కడ ఊళ్ళేచెట్టేదో ఉన్నట్టు...

నిరుత్తరురాలే అయింది స్వర్ణ.మూడువేలు... అదేదో మూడు రూపాయల్లా ఎంత తేలిగ్గా చెప్పేశాడు. నెలనెలా రెండువేలు తీసుకురా, మూడు వేలు తిసుకురా అంటూ పీకమీద కత్తిపెట్టి తనని పుట్టింటికి తరమడం... జీవచ్ఛవంలా తను సిగ్గుతో చచ్చిపోతూ తండ్రిని అడగడం... రిటైరయి... ముసలితనంలో చీకూ చింతా లేకుండా హాయిగా బ్రతుకు వెళ్ళదీయవలసి ఆయన. వాళ్ళ కాళ్ళూ, వీళ్ళ కాళ్ళూ పట్టుకుని అప్పో సప్పో చేసి, ఇంట్లో ఉన్న సామాను ఒక్కొక్కటీ అమ్మేస్తూ, ఇల్లు తాకట్టు పెట్టి మొత్తమ్మీద కూతురి కాపురం నిలబడాలని ప్రతి సారీ నానాకష్టాలు పడుతూనే ఉన్నాడు ఇలా ఎన్నాళ్ళు?ముష్టి మూడు వేలు అంటూ తల్లీకొడుకులు ప్రతి నిమిషం తిట్ల దండకాలు చదువుతూ ఉంటారు.తన తండ్రి అబద్ధం చెప్పి ఈ పెళ్ళి చెయ్యలేదే! తన తాహతు చెప్పుకున్నాడు మొదటే... మూడు వేలు కంటే ఇచ్చుకోలేనని పెళ్ళి చూపులనాడే చెప్పుకున్నాడు. అప్పుడు మూడు వేలకి ఒప్పుకున్న వాళ్ళు తర్వాత నించీ తనని ఇలా చిత్రహింస పెట్టడ మెందుకూ? వాళ్ళబ్బాయికి ఇంత ఇచ్చారుట వీళ్ళబ్బాయికి ఇంత ఇచ్చారుట అంటూ వాళ్ళతోనూ వీళ్ళతోనూ పోల్చుకుంటూ తనని హింస పెట్టడం న్యాయమేనా?

కొత్తలో ఒకరోజు ఉండబట్టలేక ఈ ప్రశ్న వేసినందుకు తల్లీ కొడుకులిద్దరూ విరుచుకుపడ్డారు మీద. అనరాని మాటలన్నారు. దెబ్బల్తో ఒళ్ళు హూనం చేశారు. మళ్ళీ ఆ ప్రశ్న ఎప్పుడూ వెయ్యలేదు స్వర్ణ. భర్తకీ, అత్తగారికీ కాఫీలిచ్చి ఓ రెండు చెమ్చాల కాఫీ మిగిల్తే తను తాగబోయింది.

"ఓహోహో! తమరిక్కూడా కాఫీయా! పొద్దున్న ఒకసారి తాగావు చాలదూ? మళ్ళీ సాయంత్రం కాఫీ కూడా నాకు తెలియకుండా తాగుదామనుకుంటున్నావా? మీ నాన్న ఇచ్చిన కట్నం ఇక్కడ మురిగిపోతోందనుకున్నావా? నీకు ఒక పూట కాఫీ. ఒక పూట అన్నమే ఎక్కువ... ఊ. ఆ కాఫీ కూడా. నా గ్లాసులో పోసెయ్యి..." కోడలి చేతిలో గ్లాసు లాక్కుని, అందులో అట్టడగున ఉన్న ఆ రెండు చుక్కల కాఫీ తనగ్లాసులో వొంపుకుంది తాయారమ్మ నిర్లిప్తంగా చూస్తుండిపోయింది స్వర్ణ... క్రితం రోజు, అత్తగారు తన కాళ్ళమీద పెట్టిన వాతలు మంటలు పుట్టిస్తున్నాయి. నిన్నటి నుంచీ భరించలేనంతగా... ఆ బాధని మించి పోయేంతగా మండుతోంది మనసు...

కాళ్ళమీద కాస్త కొబ్బరినూనె చుక్క రాసుకుంటే ఉపశమనంగా ఉంటుందేమోనని, గూట్లోంచి కొబ్బరినూనె సీసా అందుకుంటుంటే, గయ్యిమంటూ మీద పడి చేతిలోంచి సీసా లాక్కుందావిడ ఆయింట్‌మెంట్ కొనుక్కునే భాగ్యాన్ని ఎలాగో నోచుకోలేదు. కాస్త నూనెబొట్టు కూడా తీసుకోనివ్వరు.

"ఇంత లావూ, ఇంత పొడుగూ, నీ జుట్టు,నీ తలకి కొబ్బరినూనెకి ఎంత డబ్బా అయిపోతుంది. మీ నాన్నేం అక్కడ రాసులు పోసి వెళ్ళలేదు..." అస్తమానం ఆనందరావు చేసే వ్యాఖ్యల్లో ఇది ఒకటి.

"వాడు చూశాడంటే నీతలకే కాక కాళ్ళక్కూడా కొబ్బరినూనె కావల్సి వచ్చిందా అని, ఇంకో నాలుగు వాతలు పెడతాడు జాగ్రత్త" హుంకరించింది తాయారమ్మ.

బాధ నుంచి కాస్తయినా ఉపశమనం పొందడానికి, గుండెబరువు దించుకునేందుకు ఏడుపుకాక మిగిలిందేమిటి ఆమెకి?

"అమ్మా! నేనింక ఆ నరకంలోకి వెళ్ళలేను. నన్నిక్కడే వుండిపోనివ్వండమ్మా... మీకు పుణ్యం ఉంటుంది" అడగలేక అడగలేక నోరుతెరిచి అడిగింది ఆ రోజు స్వర్ణ. మూడు వేలు తీసుకురమ్మని భర్త తరిమితే పుట్టింటికి వచ్చి... ఎంత డబ్బా ఆ తాగుడికీ, పేకాటకీ, జల్సాలకీ సరిపోదయ్యేమరి... మామగారంటే, అడిగినప్పుడల్లా తలతాకట్టుపెట్టి అయినా సరె అడిగినంతా పంపిస్తూ ఉండాలి అతని దృష్టిలో.

కూతురి మాటలకి సింహంలా గర్జించాడు స్వర్ణ తండ్రి జగన్నాథం.

"ఏమిటీ... అత్తారింటికి వెళ్ళకుండా ఇక్కడే వుండిపోతావా? పిచ్చిగా మాట్లాడకు. నీకు బుద్ధిలేకపోతే నాకు బుద్ధిలేదనుకుంటున్నావా? కాపురానికి వెళ్ళకుండా నువ్విక్కడే వుండిపోతే, నేను వీధిలో తలెత్తుకుని తిరగాలా వద్దా? తిండిలేక పోయినా బతగ్గలనుగానీ, పరువు పోయాక నేను బతకడమన్నది కల్ల... అది గుర్తుపెట్టుకో"

అంటే... పెళ్ళయిన ఆడదానికి అత్తారిల్లు నరకమైనాసరే అనుభవించి తీరవల్సిందేనా? రోజు రోజూ చస్తూ బతకవల్సిందేనా? ఎట్టి పరిస్థితుల్లోనూ పుట్టింటివాళ్ళ ఆదరణ కోరడానికి వీల్లేదా? ఆ నరకం నుంచి విముక్తి కలిగించేందుకు పుట్టింటి వారు చేయూత నివ్వరా?

ఇవ్వకూడదా? పరువు, ప్రతిష్ఠ, ఎందుకూ పనికిరాని గొప్పతనాలు వీటిముందు... ఒక ఆడదాని ప్రాణం తీసికట్టేనా? ఎంత అల్పమైనది ఆడదాని బ్రతుకు... ఈ సమాజం మారదా? ....తనబోటివాళ్ళ బ్రతుకులకి విముక్తి లేదా?

ఆ రాత్రి ఎంతసేపో ఆలోచించింది స్వర్ణ. ఆ నరకంలో వుండాలని లేదు తనకి. అందులోంచి బయటపడాలని ప్రయత్నిస్తే తండ్రి ఒప్పుకోడు. వాళ్ళ చేతుల్లో దెబ్బలు తింటూ, మనసుని తూట్లుపొడిచే తిట్లు తింటూ, లోలోపల కుమిలిపోతూ, తనూ ఒక మనసున్న మనిషేనన్న మాట మర్చిపోయి ఎన్నాళ్ళని బ్రతకటం? ఎందుకు బ్రతకాలి? ఎవరికోసం బ్రతకాలి?... ఔను తనబోటిదానికి ఆత్మహత్య తప్ప గత్యంతరం లేదు... ఆ అర్ధరాత్రి... మెల్లిగా పెరటి తలుపు తీసి నూతి దగ్గరికి నడిచింది స్వర్ణ. కూతురు మంచం దిగి గదిలోంచి బయటికి వెళ్ళడం గమనించిన తల్లి తులశమ్మ, చప్పుడు కాకుండా తనూ చీకట్లో అనుసరించింది. ఏ అఘాయిత్యం చేస్తుందోనన్న అనుమానం వచ్చింది.

ఒక్క ఉదుటున చాటునుంచి ముందుకు వచ్చి, నూతిగట్టుమీద ఎక్కబోతున్న కూతుర్ని చేయిపట్టుకు లాగింది.

“అమ్మా!” తల్లి గుండెల్లో తలదాచుకుంది ఆపుకోలేని దుఃఖంతో.

“నన్ను చావనీ అమ్మా!... నన్ను చావనీ...”

“తప్పమ్మా! ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యకు నీ తల్లి మనసు కోత పెట్టకు. కలో గంజో కలిసి తాగుదాం. నువ్వు మా దగ్గిరే ఉండు తల్లీ. మా దగ్గిరే వుండు... ఆ నరకంలోకి వెళ్ళకు ఈ మాట చాలా రోజుల కిందటే నీకు చెప్పి ఉండాల్సింది నేను. కానీ, ఓపికగా నీతో పాటు నేనూ ఎదురుచూశాను ఇన్ని రోజులూ, వాళ్ళ మనసులు మారతాయేమోనని, కానీ ఫలితం కనిపించలేదు... ఇప్పటికైనా కళ్ళుతెరిచి నా కూతుర్ని నేను రక్షించుకోవడం నా కర్తవ్యం తల్లీ లేకపోతే ఈ “తల్లి” అన్న పదానికి విలువే లేదు”.

“కానీ, అమ్మా.. మరి.... మరి..., నాన్నగారు నేను కాపురానికి వెళ్ళకుండా మీ దగ్గర ఉండిపోతే ఒప్పుకోరు కదమ్మా?” భయం తొంగిచూసింది స్వర్ణ కళ్ళల్లో.

“నీ భర్తకి డబ్బు, నా భర్తకి పరువు ఇవే ముఖ్యం వాళ్ళకి. వీటి ముందు ఆడదాని ప్రాణానికి కొంచెం కూడా విలువ లేదు వాళ్ళ దృష్టిలో. అల్లుడు అడిగినప్పుడల్లా ఇవ్వకపోతే కూతుర్ని ఎక్కడ వదిలేస్తాడో, వదిలేస్తే ఇంటిపరువు పోతుందని అప్పుల మీద అప్పులు చేస్తూ ఇప్పటికే పీకల్దాకా అప్పుల్లో మునిగివున్నారు మీ నాన్నగారు. అయినా ఆయనకి తెలిసిరావట్లేదు. అటు, అడిగినప్పుడల్లా వేలకి వేలు పంపుతూ అల్లుడి చెడు అలవాట్లకి ఇంకా దోహదం చేస్తున్నారు. ఇటు.. తను... కట్టుబట్టలతో నడిరోడ్డుమీద నిలబడే పరిస్థితి చేజేతులా తెచ్చుకుంటున్నారు. దానిబదులు... ఇంక అతని ధనదాహాన్ని తీర్చడం తనవల్ల కాదని ఖచ్చితంగా చెప్పేసి నిన్ను నీ కాళ్ళమీద నువ్వు నిలబడేలా చేయటం మంచిది కదా!”

“అమ్మా...” తల్లి మంచి మనసుకి జోహారు లర్పించింది స్వర్ణ.

!+!+!+!

"ఏవిటి? అమ్మాయింక అత్తారింటికి వెళ్ళదా? అర్థంలేని వాగుడు కట్టిపెట్టు. పరువు మర్యాదలుగల కుటుంబం మనది".

"నా కూతురి ప్రాణం ముఖ్యం నాకు"

"ఓహో! ఎదురుమాట్లాడుతున్నావా నాకు?"

"ఔనండీ.. మాట్లాడుతున్నాను. పెళ్ళయిన ఇన్నేళ్ళలో నోరుతెరిచినేను ఇవాళ మొదటిసారి మీ ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నాను... ఔను. మొదటిసారి నోరుతెరిచి మాట్లాడుతున్నాను మీతో..."

కోపంతో తండ్రి కళ్ళు ఎఱ్ఱబడటం పిడికిళ్ళు బిగుసుకోటం గమనించింది స్వర్ణ. భయంతో కాళ్ళు గడగడలాడాయి. మెల్లిగా తల్లి వెనక్కి చేరింది.

"పెళ్ళయి కాపురానికి వొచ్చిన కొత్తలో ఓ రోజు ముచ్చటపడి సరదాగా మీతో కలిసి భోజనం చెయ్యాలని వుందని మిమ్మల్ని అడిగితే "మాది పరువుగల కుటుంబం... వేషాలు వెయ్యాలని చూడకు. మగవాళ్ళ సరసన ఒకే పంక్తిలో ఆడవాళ్ళు కూర్చుని భోజనం చెయ్యడానికి సిగ్గుపడే పరువు ప్రతిష్టగల కుటుంబం మనది. ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకు మా అమ్మ విందంటే చంపేస్తుంది" అని మీరు విదిలించి కొట్టినప్పుడు నోరు మూసుకుని వూరుకున్నాను. మాట్లాడలేదు. స్వర్ణని కడుపుతో వున్నప్పుడు మూడో నెల్లో ఒకసారి పుట్టింటివాళ్ళు తీసికెళ్ళి తీసుకురావాలి. ఆ మాత్రం తెలియదా మీ వాళ్ళకి అంటూ మీ అమ్మగారు దెప్పిపొడుస్తుంటే, ఏవండీ మా నాన్నకి అనారోగ్యంగా వుందని, చాలా జబ్బుచేసిందని మా అమ్మ దగ్గర్నుంచి ఉత్తరాలొస్తున్నాయి కదా. ఈ పరిస్థితిలో ఆయనే వొచ్చి తీసికెళ్ళాలీ అంటే రానూ, పోనూ ఇంత దూరప్రయాణం చెయ్యలేరు... పోనీ, మీరే నన్ను తీసికెళ్ళండి మావాళ్ళింటికి... అని నేను అడిగినప్పుడు, ఎంత తలపొగరు నీకు పుట్టింటివాళ్ళొచ్చి తీసికెళ్ళాల్సిన పద్ధతి వున్నప్పుడు నేనెందుకు తీసికెళ్ళాలి? ఇరుగుపొరుగు ఏమనుకుంటారు? ఎంత చులకనగా చూస్తారు నన్ను? ఈ కుటుంబం గౌరవం ఏం కావాలి? అంటూ మీరు రంకెలు వేసినప్పుడు మాట్లాడకుండా నోరుమూసుకుని ఊరుకున్నాను నేను. మనకున్నది ఒక్కతే కూతురు. చదువులో మంచి తెలివితేటలున్నాయి దానికి. చక్కగా పెద్ద చదువులు చదివించండి దాన్ని అని నేను చెప్పినప్పుడు, ప్రపంచ ప్రళయమే ముంచుకొచ్చినట్టు నా మీద కోపం తెచ్చుకుని, ఆడపిల్లలు పెద్ద చదువులు చదవడం మా ఇంటావంటా లేవు. లేనిపోనివన్నీ దానికి నేర్పి పెట్టకు. ఆడపిల్లలు హైస్కూల్ చదువు చదవడమే ఎక్కువసలు. అంతకంటే అనవసరం అని మీరన్నప్పుడు మాట్లాడకుండా ఊరుకున్నానండీ నోరుమూసుకుని... ప్రతి విషయంలోనూ మీ ఇష్టప్రకారమే జరుగుతూ వచ్చింది... నేను ఎదురుమాట్లాడలేదు మీకు... ఆ రోజు నుంచీ ఈ రోజు వరకూ మీ ఇష్టప్రకారమే నడిచాను... ఇన్నేళ్ళకి ఇప్పుడు నేను నోరుతెరిచి మాట్లాడుతున్నాను... ఏదో ఓరోజు నా కూతుర్ని వాళ్ళు చంపనైనా చంపుతారు. ఆత్మహత్య

అయినా చేసుకుంటుంది ప్రాణం విసిగి. ఆ రోజు ఎంతో దూరం లేదు. ఆ రోజు రాకుండానే చూసుకోవాలి తప్ప, ఏడ్చి లాభం లేదు అంతా జరిగిపోయాక...”

మొట్టమొదటిసారి, తల్లి అంత ఆవేశంగా మాట్లాడుతుంటే తెల్లబోయి చూస్తోంది స్వర్ణ.

జగన్నాథం కూడా గుడ్లప్పగించి చూస్తున్నాడు.

ఎఱ్ఱబడ్డ అతడి కళ్ళు మామూలు రంగులోకి మెలిమెల్లిగా వొస్తున్నాయి.

బిగుసుకున్న అతడి పిడికిళ్ళు మెల్లిగా తెరుచుకున్నాయి.

“నలుగురూ నవ్వరా? ఇరుగుపొరుగు ముందు నేను తలెత్తుకు తిరగనక్కర్లేదా అంటారు మీరు... హూ... మీ కూతురి కాపురం చక్కదిద్దడానికి వొచ్చారా ఊళ్లో వాళ్ళు... మీ అల్లుడిని సరియైన మార్గంలో పెడతారా ఈ ఇరుగుపొరుగు? అవేమీ లేనప్పుడు, మిమ్మల్ని చూసిగానీ, మీ అమ్మాయిని చూసిగానీ నవ్వే హక్కు ఊళ్లో వాళ్ళకి లేదండీ... లేదు... అటువంటి సంఘానికి మీరుగాని, నేనుగానీ ఎందుకు భయపడాలి? పరిహాసం చేయడమే తెల్సిన ఈ సంఘానికి భయపడి, కన్నకూతుర్ని బలిపెట్టుకుంటారా చెప్పండి ఈ ఇంట్లో అమ్మాయి కూడా మనతో ఉండడానికి మీరు ఒప్పుకుంటేనే, నేనూ ఈ ఇంట్లో ఉండేది. లేకపోతే, ఇప్పుడే అదీ, నేనూ ఈ గడప దాటతాం. ఇంత విశాల ప్రపంచంలో మా ఇద్దరికీ చోటు లేకుండా పోదండీ... ఈ ప్రపంచం చాలా విశాలమైంది. మన మనసులే ఇరుకైనవి...”.

ఇన్నేళ్ళుగా నోరువిప్పని తన భార్యేనా ఇలా మాట్లాడుతున్నది? నమ్మలేకపోతున్నాడు జగన్నాథం.

నాలుగ్గోడల మధ్యా బంధించి కొడితే పిల్లి కూడా పులిగా మారి పీకుతుంది అన్న మాట నిజమేనా?...

ఇప్పటికి ఇన్నేళ్ళకి జగన్నాథంలో ఆలోచన రేకెత్తింది... భార్య మాటలు కాస్త చైతన్యం కలిగించాయి. ఆమె పలికిన ఒక్కొక్క మాటా ఆయన్ని అవమానంతో కుచించుకుపోయేలా చేసింది... ఆలోచింపచేసింది... మనసుని శుద్ధిచేసింది. కట్టుకున్న భార్యని ఓ పురుగులా కాక, ఓ మనిషి అన్న భావంతో మొట్టమొదటి సారిగా కొత్తగా చూశాడు... ఆ చూపు కోసం ఇన్ని సంవత్సరాలుగా సహనంతో ఎదురుచూసిన ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. మాటల్లో వర్ణించలేని తృప్తి ఆమె మనసంతా నిండింది.

ఇప్పుడు జగన్నాథానికి తన భార్యా, కూతురే ప్రపంచమైంది. మిగతా ప్రపంచం శూన్యమైంది. కూతురి బ్రతుకే ధ్యేయమైంది. ఇరుగు పొరుగుల మాటలు తాటాకు చప్పుళ్ళయ్యాయి.

!+!+!+!

భార్య కాపురానికి రానని ఖచ్చితంగా చెప్పేసరికి హతాశుడయ్యాడు ఆనందరావు... అంత ధైర్యంగా ఆ మాట అంటుందని అతను కల్లో కూడా వూహించలేదు... కొట్టినా,

చంపినా ఇక్కడే తన దగ్గిరే పడివుంటుందని, కట్నం తక్కువ పుచ్చుకున్నాం కదా అన్న వంకతో ఎప్పటిలా ఇలాగే నెలనెలా మావగారి దగ్గిరకి పంపించి డబ్బు తెప్పించుకుంటూ జల్సాలు చేసుకుంటూ ఉండొచ్చని అనుకుంటున్నాడే తప్ప ఇలా ఎదురు తిరుగుతుందని ఏనాడూ అనుకోలేదు... చేతులు కాలాక ఇప్పుడింక ఆకులు పట్టుకుని ప్రయోజనం ఏముంది? భార్య మీద కోపం తల్లి మీద చూపించడం మొదలు పెట్టాడు.

!+!+!+!

కథ చెప్పడం ముగించింది లతాదేవి. ఒక్కసారి సభను కలయచూసింది. అందరూ నిశ్శబ్దంగా ఆమె వంకే చూస్తున్నారు.

"నేను అబలను కాను, సబలనని నిరూపించుకునేందుకు నాకు అవకాశం ఇచ్చినదీ, చేయూత నిచ్చి నా వెన్నుతట్టి బ్రతుకుమీద నాకు ఆశ కల్పించినది మరో స్త్రీయే... ఆమె నా కన్నతల్లి... నా దైవం. ఈ పాటికి మీ అందరికీ అర్థమయ్యే ఉంటుంది... కథలో నేను చెప్పిన స్వర్ణ మరెవరో కాదు. ఈ లతాదేవే ఆ స్వర్ణ..... నా పూర్తిపేరు స్వర్ణలతా దేవి. ఇప్పుడు నా తల్లిదండ్రులీ లోకంలో లేరు. కానీ, తాను పోవడానికి ముందే, నన్ను... నా కాళ్ళమీద నేను నిలబడేలా చేయడమే కాక మరికొంతమంది తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు చేయూతనిచ్చేలా నన్ను తయారుచేసింది నా తల్లి. బాధ్యతగల ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, మీలో ఎంతోమందికి ఎన్నో సంవత్సరాలుగా నేను పరిచితురాలనే.. రచయిత్రిగా ఎంతో కీర్తి. మరెంతో డబ్బూ సంపాదించాను. ఆ ధనాన్ని ఈ సేవాసదనం రూపంలో మీ ముందు పెట్టి అంచెలంచెలుగా దీన్ని వృద్ధిలోకి తీసుకొస్తున్నాను. ప్రతి స్త్రీ ఒక ఝాన్సీలక్ష్మి కాలేకపోవచ్చు... ప్రతి స్త్రీ ఒక రుద్రమదేవి కాలేకపోవచ్చు కాని ప్రతి వనితా మనసూ, ప్రాణమూ ఉన్న మనిషిగా గుర్తింపబడి, ఆత్మస్థయిర్యంతో, ఆత్మ గౌరవం నిలబెట్టుకుంటూ, ఆడది అబల కాదని సబలేనని నిరూపిస్తూ వెలుగుబాటలో పయనించగలగాలి. అదే ఈ సేవాసదనం యొక్క ప్రధాన లక్ష్యం" చప్పట్లతో ఆ ప్రదేశమంతా మారుమోగిపోయింది... తల్లిని తలుచుకొని మనసులోనే నమస్కరించింది స్వర్ణలతాదేవి.

!+!+!+!

"ఈ ఊళ్ళో సేవా సదనం ఉందని తెలిసి కష్టపడి టిక్కెట్టుకి సరిపడా డబ్బులు సంపాదించి, ఎలాగో అలా ఈ వూరొచ్చి పడ్డానమ్మా... ఉన్న ఒక్కగానొక్క కొడుక్కీ నేను బరువై పోయాను. తల్లీ! పురుగుకంటే హీనంగా నన్ను విదిలించి పడేస్తున్నాడు యాభై ఏళ్ళు నెత్తిమీది కొచ్చాయని పేరేగాని, పాతికేళ్ళనాడు ఎలా విచ్చలవిడిగా జల్సాలోకంలో బతికాడో ఇప్పటికీ అలాగే వున్నాడు తల్లీ. మార్పులేదు... ఇంక నన్ను చూసే దిక్కే లేదు. ఈ వయసులో కళ్ళు సరిగ్గా కనపడక, చెవులు సరిగ్గా వినపడక, కష్టపడి పనిచేసి పొట్టనింపుకునే శక్తిలేక రోజులు గడవడం చాలా దుర్భరంగా వుందమ్మా మీ సేవాసదనంలో నాకింత చోటివ్వమని మీ యజమానురాలితో చెప్పు తల్లీ, నీకు పుణ్యం వుంటుంది."

గది బయట వరండాలో అన్నపూర్ణని ఆ ముసలావిడెవరో అర్థిస్తుండడం కిటికీలోంచి కనిపించింది స్వర్ణలతాదేవికి. ఎవరో తెలిసిన మొహంలా అనిపించి పరీక్షగా చూసింది మళ్ళీ చెవుల్లో మారుమ్రోగాయి స్వర్ణలతా దేవికి అవతలివారి మీద ఉన్న కసితో, కోపముతో వారికి సహాయపడకుండా ఉండటం చాలా తేలిక... కానీ ఆ కసినీ, కోపాన్ని దయా దాక్షిణ్యాలుగా మార్చుకుని వారికి సహాయపడటమే కదా కష్టతరమూ గొప్ప విషయమూ...

కిటికీలోంచి చూస్తూ అన్నపూర్ణని పిలిచింది.

"అన్నపూర్ణా! ఆవిడ చేయిపట్టుకుని, నెమ్మదిగా ఈ గదిలోకి తీసుకురా. ఆవిడకి ఈ సదనంలో చోటుందని చెప్పు. నిరభ్యంతరంగా ఆమె మనతో ఉండవచ్చని చెప్పు. కానీ పాపం! ఆమెకి కంటిచూపు సరిగా ఆనదనుకుంటాను పెద్ద వయసు మూలంగా... నువ్వు అందంగా రాసి తగిలించిన ఆ అట్టమీది వాక్యాలు అవి స్వయంగా చదవలేదే అన్నదే నా బాధ". ఎదురుగా గోడకి పైన ఎత్తుగా వేలాడదీసిన అట్టమీద దృష్టి నిలిపి అంది లతాదేవి.

ఔను... అది అన్నపూర్ణ రాసి తగిలించింది అక్కడ. దానిమీద ఇలా వుంది "నాలుగ్గోడల మధ్యా బంధించికొడితే పిల్లి కూడా ఎదురు తిరుగుతుంది, పులిగా మారుతుంది".

తెల్లబోయింది అన్నపూర్ణ ఇప్పుడా ముసలావిడ ఇది చదవకపోతేనేం? దానికోసం అమ్మగారు బాధపడటమెందుకూ? అర్థం కాలేదామెకి.

అన్నపూర్ణ చేయిపుచ్చుకుని మెల్లిగా నడుచుకుంటూ వరండాలోంచి ఆ గదిలోకి... స్వర్ణ ఉన్న గదిలోకి అడుగు పెట్టింది తాయారమ్మ. ఆనాటి అత్తగారు.

★☆★☆★